నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 27 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

ప్లకార్డుతో ఎమ్మెల్సీ తాతా మధు

'తులం బంగారం' ఏమైంది?

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన

ఖమ్మం, మార్చి 26: రాష్ట్రవ్యాప్తంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని శాసన మండలి ఆవరణలో పెద్దఎత్తున నినాదాలు చేశారు. తులం బంగారం ఇవ్వాలని బంగారు కడ్డీల నమూనాలను ప్రదర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పెళ్లయిన వారందరికీ తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఎమ్మెల్సీ తాతా మధు తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో రైతులకు మేలు: వద్దిరాజు

ఖమ్మం, మార్చి 26: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రసంగానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఎంపీ రవిచంద్ర బుధవారం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రూ.లక్ష రుణాలను ఏక మొత్తంలో మాఫీ చేసి వ్యవసాయ రంగాన్ని గొప్పగా అభివృద్ధి చేశారని వివరించారు. ఈ సందర్భంగా సభలో ఉన్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ కేసీఆర్ పాలనలో రైతులు, వ్యవసాయరంగానికి మేలు జరిగిన మాట నిజమేనని అన్నారు. కాంగ్రెస్ 2008, 2009 సంవత్సరాల్లో రైతు రుణమాఫీ గురించి హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదన్నారు. అదేవిధంగా 2023లో కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఊదర గొట్టి ఎన్నికలలో లబ్ధి పొందిందని విమర్శించారు. అరకొరగా కొద్దిమందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయని, చాలావరకు కాగితాలకే పరిమితమైనట్లు తెలిపారు.

కుప్పకూలిన భవనం

ఒకదానిపై మరొకటి పడిన స్లాబులు

రోదిస్తున్న ఉపేందర్ భార్య రమాదేవి

లైట్ల వెలుతురులో ఆక్సిజన్ పంపుతున్న టీం

'కూలి'న బతుకులు!

- ఆరంతస్తుల శిథిలాల కింద క్షతగాత్రులు, మృతులు ఎందరు?
- అనుమతి లేకుండా యథేచ్ఛగా ఆరు అంతస్తుల నిర్మాణం
- పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఘటన
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన జిల్లా యంత్రాంగం
- దగ్గరుండి పర్యవేక్షిస్తున్న కలెక్టర్ జితేశ్, ఎస్పీ రోహిత్‌రాజు

ఆరు అంతస్తుల భవనం బుధవారం ఒక్కసారిగా కుప్పకూలడంతో భద్రాచలం వాసులు ఉలిక్కిపడ్డారు. శిథిలాల కింద ఎంతమంది కూలీలు మృతిచెందారు? ఎంతమంది క్షతగాత్రులుగా మిగిలారు? అనే అంశంపై స్పష్టత రావడం లేదు. భద్రాచలం పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో సలీం టీ స్టాల్ పక్కనే షేక్ మౌలానా అలియాస్ శ్రీపతి అనే వ్యక్తి శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టు పేరుతో భవన నిర్మాణాన్ని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టాడు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలోనే ఒక్కసారిగా పేకమేడలా భవనం కూలిపోయింది. దీంతో నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కూలీలు భవనం శిథిలాల్లో చిక్కుకుపోయినట్లు సమాచారం. పోలీసులు, రెస్క్యూ, ఫైర్ సిబ్బంది, అధికార యంత్రాంగం హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. పడిశాల ఉపేందర్‌రావు, చల్లా కామేష్ అనే ఇద్దరు కూలీలు పని చేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు చెబుతున్నప్పటికీ అసలు ఎంతమంది శిథిలాల్లో చిక్కుకున్నారనే విషయం అధికారికంగా వెల్లడి కాలేదు. కాగా, ఆ ఇద్దరి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఉపేందర్‌రావు, కామేష్‌లు రెండు రోజులుగా భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. తన భర్త ఉపేందర్‌రావును కామేష్ అనే వ్యక్తి పని నిమిత్తం బుధవారం తీసుకువచ్చినట్లు ఉపేందర్‌రావు భార్య రమాదేవి రోదిస్తూ తెలిపింది.

–భద్రాచలం, మార్చి 26

మిన్నంటిన రోదనలు

ఆరంతస్తుల భవనం కుప్పకూలడంతో పనులు చేసేందుకు వచ్చిన కూలీల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. భవనం శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారు? అసలు ఉన్నారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. శిథిలాల కింద ఇద్దరు ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ అనధికారికంగా ఎంతమంది కూలీలు చిక్కుకున్నారనేది మాత్రం తెలియరాలేదు.

హుటాహుటిన సహాయక చర్యలు

భవనం కుప్పకూలిందన్న సమాచారంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. గంటల వ్యవధిలోనే రెస్క్యూ, పోలీసు, అగ్నిమాపక, సింగరేణి బృందాలు భవనం కుప్పకూలిన ప్రదేశానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర రావు, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు కూడా దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

పర్యవేక్షణ లోపమా?

ఏజెన్సీ ప్రాంతంలోని భద్రాచలం పట్టణం 1/70 యాక్ట్ పరిధిలో ఉంది. ఇక్కడ బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఉండవు. ఒకవేళ ఉన్నా కఠినతరంగా ఉంటాయి. ఇలాంటి నేపథ్యంలో ఆ భవనంలో ఆరు అంతస్తుల నిర్మాణానికి ఎలా అనుమతులొచ్చాయి? ఒకవేళ అనుమతులు లేకుండానే నిర్మాణం చేపడుతున్నారా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దానికితోడు నిర్మాణంలో నాణ్యతా లోపం కూడా స్పష్టంగా ఉన్నట్లు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం నిర్మాణంపై అభ్యంతరం చెబుతూ గిరిజన సంఘాలు చేసిన ఫిర్యాదులను కూడా అధికారులు పట్టించుకోలేదని స్పష్టమవుతోంది.

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్, ఎస్పీ రోహిత్‌రాజు

గుమిగూడిన జనం

శిథిలాల్లో ఆర్తనాదాలు..

ఆక్సిజన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపించిన రెస్క్యూ సిబ్బంది

'కాపాడండి..' అంటూ శిథిలాల్లో నుంచి ఓ వ్యక్తి చేసిన ఆర్తనాదాలు రెస్క్యూ సిబ్బందికి వినిపించాయి. దీంతో వారు క్షుణ్ణంగా పరిశీలించారు. 'నా పేరు కామేష్. నన్ను కాపాడండి' అంటూ అతడు అరిచినట్లు వినిపించింది. దీంతో రెస్క్యూ బృందాలు అతడిని కాపాడేందుకు లైట్ల వెలుతురు మధ్య పైపుల ద్వారా ఆక్సిజన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపించారు. శిథిలాలు అతడిపై పడకుండా అడుగు భాగంలో జాకీలను ఏర్పాటు చేశారు. అతడితో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడి ధైర్యం చెప్పారు.

కుప్పకూలకముందు భవనం (ఫైల్)

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీలో

మాకు ప్రాధాన్యమివ్వాలి

- కేశవాపురం, జగన్నాథపురం గ్రామస్తుల ఆందోళన
- అర్ధనగ్నంగా నిరసన.. ట్యాంకు ఎక్కిన యువకులు..

పెద్దమ్మతల్లి గుడి ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పాల్వంచ రూరల్, మార్చి 26: పెద్దమ్మతల్లి ఆలయ కమిటీలో తమకు సముచితస్థానం లభించలేదని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల ప్రజలు బుధవారం ఆలయం వద్ద ఆందోళన చేశారు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసేందుకు రాగా ఆ రెండు గ్రామాల ప్రజలు భారీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్న తమకు పాలక మండలిలో ప్రాధాన్యం కల్పించాలని, స్థానికేతరులకు, అనుభవంలేని వారికి కమిటీలో స్థానం కల్పించొద్దని నినాదాలు చేశారు. ఇద్దరు యువకులు పక్కనే ఉన్న వాటర్‌ట్యాంక్ ఎక్కడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. తమ గ్రామాల వారికి ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చేంతవరకు ట్యాంకు దిగమని హెచ్చరించారు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడానికి వీలులేదని ఆ రెండు గ్రామాల ప్రజలు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. పాల్వంచ సీఐ, ఎస్ఐలు ఆలయం వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ఈ విషయమై ఆలయ ఈవో రజనీకుమారి మాట్లాడుతూ ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాణస్వీకారం నిర్వహించడంలేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలిపారు.

లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి

జాబ్ మేళాలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కొణిజర్ల, మార్చి 26: విద్యార్థినులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడి చదవాలని, అత్యున్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి అధికారి కార్యాలయ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువులో బాలుర కంటే బాలికలే ఎక్కువగా రాణిస్తున్నారని, ఆడపిల్ల పుడితే గర్వకారణంగా భావించేందుకు జిల్లాలో 'గర్ల్ ఫ్లైడ్' అనే వినూత్న కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడ ఆడపిల్ల జన్మించినా జిల్లా అధికారి స్వీట్ బాక్స్‌తో వెళ్లి ఆ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుతారని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టల్‌లో ఉన్న బాలికలకు అధిక బాధ్యత ఉందని, మీరంతా రాణించి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. జీవితంలో ధైర్యం చేస్తేనే పైకి ఎదుగుతామని, ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని ప్రతి విద్యార్థిని నిర్దేశించుకోవాలన్నారు. తాను 7వ తరగతి చదివే సమయంలో విజయలక్ష్మి టీచర్ తన బోధనా పద్ధతులను మార్చి తనపై తీసుకున్న శ్రద్ధతోనే నేడు కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి మాట్లాడుతూ 'మా పాప మా ఇంటి మణిదీపం' అనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత జాబ్‌మేళాలో మనకు వచ్చేది మొదటి అవకాశం మాత్రమేనని, భవిష్యత్‌లో మెరుగైన అవకాశాలు మరింతగా వస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి జాబ్‌మేళాలో ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో గురుకుల నిర్వహణ, అభివృద్ధి పనులపై సమీక్షించారు. గురుకుల హాస్టల్‌లో ఫర్నిచర్, బుక్స్ కోసం ప్రతిపాదనలు రూపొందించి అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రజిత, ఉపాధ్యాయులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఇల్లెందులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆవునూరి మధు

కాంగ్రెస్ సర్కార్‌ది జల దోపిడీ

- మైదాన ప్రాంతానికి గోదావరి నీళ్లు తరలించేందుకు ముగ్గురు మంత్రుల కుట్ర
- నీటి తరలింపును అడ్డుకునేందుకు పార్టీలన్నీ కలిసికట్టుగా ముందుకు రావాలి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు

ఇల్లెందు, మార్చి 26: ఏజెన్సీ ఆదివాసీ గిరిజన ప్రాంతాలకు గోదావరి నీళ్లు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జల దోపిడీకి పాల్పడుతున్నదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు ఆరోపించారు. ఇల్లెందు పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తలాపున గోదావరి జలాలను పెట్టుకొని ఏజెన్సీ ప్రాంతవాసులు తాగు, సాగునీటికి ఇబ్బంది పడుతుంటే బాధగా ఉందన్నారు. గోదావరి జలాల కోసం గత ముఖ్యమంత్రి కేసీఆర్ టేకులపల్లి మండలం రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టు రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. దీని ద్వారా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు తాగు, సాగునీరు అందించాలని, గిరిజన ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించినా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఏజెన్సీ ప్రాంతానికి అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గోదావరి నీటిని మైదాన ప్రాంతానికి, మిగిలిన నీటిని ఆంధ్రాకు తరలించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, దీనిపై పోరాటాలు చేసేందుకు అన్ని పార్టీలు కలిసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నరసింహారావు, సారంగపాణి, హర్జ్యా, కట్టీ వెంకటేశ్వర్లు, రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, సూర్ణపాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మోకాళ్లపై నిల్చొని నిరసన

కాలనీలో సౌకర్యాలు కల్పించాలని సీపీఎం డిమాండ్

ఇల్లెందు రూరల్, మార్చి 26: తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరుపేదలు ఇల్లెందు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నేత అబ్బుల్ నబి మాట్లాడుతూ సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ శివారులో నిరుపేదలు ఆరేళ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నా వారికి ప్రభుత్వం తాగునీరు అందించడం లేదన్నారు. ప్రస్తుత వేసవిలో తాగునీరు అందక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని, వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అంబేద్కర్‌నగర్ కాలనీలో ధారలా వస్తున్న నీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

గంటకు బిందెడు నీళ్లు!

- మిషన్ భగీరథ పథకం ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యం.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో
- తాగునీటి కోసం ప్రజలు తల్లడిల్లుతున్నారు. పైపులైన్లు లీకేజీలు, పగుళ్లు ఏర్పడినా పట్టించుకునే వారు లేక
- పోవడంతో కాలనీవాసులు మంచినీటికి అవస్థలు పడుతున్నారు.
- సన్నటి నీటి ధారతో బిందెలు పట్టుకొని గంటలకొద్దీ ఎదురుచూడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వరుసగా నాలుగైదు రోజులు నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో మినరల్ వాటర్ కొనుక్కోవాల్సి వస్తున్నదని మండలంలోని 4 ఇంక్లైన్ పంచాయతీ అంబేద్కర్ నగర్ కాలనీవాసులు చెబుతున్నారు. వేసవి రాకముందు ఇన్ని ఇబ్బందులు ఉంటే.. మున్ముందు మా పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కనీసం ఇంట్లో వాడుకోవడానికి కూడా నీళ్లు దొరకని పరిస్థితి దాపురించిందని దిగులు పడుతున్నారు. –చుంచుపల్లి, మార్చి 26

- సన్నటి ధారతో కాలనీవాసుల సమయం వృథా
- ఇంటి పనులు వదిలి కుళాయిల వద్దే పడిగాపులు
- ప్రభుత్వంపై అంబేద్కర్‌నగర్ మహిళల ఆగ్రహం

సన్నని ధార రావడంతో కుళాయిల వద్ద వేచి చూస్తున్న మహిళ

అంబేద్కర్‌నగర్ కాలనీలో ధారలా వస్తున్న నీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

ఇంటింటికీ శుద్ధ జలాలు అందించాలనే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని పకడ్బందీగా ఏర్పాటు చేసింది. పైపులైన్లు వేసి ఎలాంటి లోటు లేకుండా సమృద్ధిగా తాగునీరు అందించింది. కానీ.. 15 నెలల క్రితం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ మిషన్ భగీరథ పథకాన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొన్నది. అక్కడక్కడా దెబ్బతిన్న పైపులైన్లకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రజలు నీరందక తంటాలు పడుతున్నారు. అరకొరగా వచ్చే నీటి ధారతో గంటలకొద్దీ కుళాయిల వద్దే ఉండాల్సి వస్తున్నదని పలువురు మహిళలు వాపోతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ స్కీం నీరే మాకు దిక్కైంది అని చెబుతున్నారు. అది కూడా రెండు మూడు రోజులకొకసారి పైపులైన్లు లీక్ కావడంతో నీటి సమస్య తలెత్తుతుందని, అప్పుడు చుక్క నీరు కూడా రాదని అంటున్నారు. తాగునీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, పైపులైన్లు మరమ్మతు చేసి తాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

మంచినీళ్లు కొనుక్కుంటున్నాం..

గ్రామపంచాయతీ నల్లా నీరు అందరికీ సరిపోవడం లేదు. చేసేది లేక మినర్ వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నాం. అది కూడా మరమ్మతులకు గురైతే ఎవరూ పట్టించుకోవడం లేదు. మేమే సొంతంగా డబ్బులు వేసుకొని మరమ్మతు చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మిషన్ భగీరథ నీరు పుక్కలంగా వచ్చే విధంగా అధికారులు చూస్తే బాగుంటుంది. బోరు వాటర్ తాగలేకపోతున్నాం.

–గోడేటి రోహిణి, అంబేద్కర్ నగర్, చుంచుపల్లి

గంటలకొద్దీ పంపు వద్దే..

పైపులు లీకవుతుండడంతో నల్లా నీరు సరిగా రావడం లేదు. బిందెలోకి పైపు పెడితే సరిగ్గా నిండడం లేదు. గంటలకొద్దీ వేచి చూడాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ పంపులు వస్తున్నాయా అంటే.. ఆ నీళ్లు రావడం లేదు. మినీ వాటర్ ట్యాంకులో నీళ్లున్నా మాకు సరఫరా కావడం లేదు. అధికారులను అడిగితే.. మీ ఏరియా ఎత్తులో ఉంది.. నీటి సరఫరా అంతంత మాత్రమే వస్తుందని చెప్పి దాటవేస్తున్నారు.

–సిరివేరి రాధ, అంబేద్కర్‌నగర్, 4 ఇంక్లైన్

నీటి సమస్యను పరిష్కరిస్తాం..

కాలనీ ఎత్తయిన ప్రదేశంలో ఉండడం వల్ల నీళ్లు సరిగా కుళాయిలకు అందడం లేదు. మూడు రోజుల నుంచి పైపుల లీకేజీ కారణంగా నీటి సరఫరా చేయలేకపోయాం. రెండు రోజుల కొకసారి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నాం. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

–వసంతకుమారి, మిషన్ భగీరథ ఏఈ, చుంచుపల్లి

ములకలపల్లి మండలంలో ఎడారిగా మారిన పాములేరులో నీటి జాడ కోసం మూగజీవాలు కదలి వెళ్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా కన్పిస్తూ ప్రతి ఒక్కరినీ కలిచివేస్తున్నాయి. మండలంలో జీవ నదులుగా పేరుగాంచిన మొర్రేడువాగు, పాములేరు వాగు, సాకివాగు, గడిపవాగు, పెద్దయ్యచెరువు అలుగు వాగు వంటివి వేసవి ప్రారంభంలోనే ఎండిపోయాయి. మండలంలోని తాళ్ల పాయ, పొగళ్లపల్లి గ్రామాల మధ్య జీవనదిగా ప్రవహిస్తూ, అడవి గుండా సాగిపోతూ పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన పాములేరు వాగు ఈ వేసవిలో ఏకంగా ఎడారిని తలపిస్తోంది. చుక్క నీరు కూడా లేకపోవడంతో ఇసుక తిన్నెలు కన్పిస్తున్నాయి. నిత్యం ఈ వాగులో నీళ్ల తాగుతూ దప్పిక తీర్చుకునే సమీప గ్రామాల పశువులు.. ఇప్పుడు దాహంతో తల్లడిల్లిపోతున్నాయి. వణ్యప్రాణుల గొంతులూ తడారిపోతున్నాయి. ఎప్పటి మాదిరిగానే నీళ్ల తాగేందుకు వచ్చిన తాళ్ల పాయ, పొగళ్లపల్లి గ్రామాల పశువులకు పాములేరులో చుక్క నీళ్లు కన్పించలేదు. వాగు దిగువనైనా నీటి గుంతలు ఉంటాయేమోనన్న ఆశతో అవి ఇసుక తిన్నెల్లో ముందుకు సాగిపోతున్నాయి.

–ములకలపల్లి, మార్చి 26